క్లుప్తంగా

ఉద్యోగ సర్వీస్ రెగ్యులర్ చేయాలని వినతి



మోపిదేవి: మినిమమ్ టైమ్ స్కేల్ ఉద్యోగులుగా రాష్ట్రంలోని పలు ఆలయాల్లో పనిచేస్తున్న తమను క్రమబద్ధీకరించాలని(రెగ్యులర్) చేయాలని కోరుతూ రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్రకు ఆయన కార్యాలయంలో శుక్రవారం వినతిపత్రం అందజేశారు. మోపిదేవి శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి దేవస్థానంలో గత 25 ఏళ్లుగా పనిచేస్తున్న సిబ్బందిని క్రమబద్ధీకరించి వార్షిక ఇంక్రిమెంట్లు, హెచ్ఆర్ఏ, డీఏ, ఐఆర్ వంటి సదుపాయాలు కల్పించాలని వారు విజ్ఞప్తి చేశారు. మంత్రి స్పందిస్తూ ఈ సమస్యలను సీఎం చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకునేలా ప్రయత్నిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

17న చెరువులు, దుకాణాలకు వేలం

పెడన: పురపాలక సంఘ పరిధిలోని మున్సిపాలిటీకి చెందిన చేపల చెరువులను, మున్సిపల్ దుకాణాలను రిజర్వేషన్ ప్రకారం లీజుకు ఇవ్వడానికి బహిరంగ వేలం పాటను ఈ నెల 17న మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు కమిషనర్ ఎల్.చంద్రశేఖరరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తచెరువు, తామరచెరువు, మల్లిచెరువులకు వేలం జరుగుతుందన్నారు. అలాగే రైల్వేస్టేషన్ రోడ్డులోని మహిళా వాణిజ్య సముదాయంలో ఏడు దుకాణాలు, మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఉన్న మహాత్మ మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లోని ఏడు దుకాణాలు, బంటుమిల్లి రోడ్డు సెంటర్‌లోని మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో రెండు, పాత కూరగాయల మార్కెట్ వద్ద ఉన్న మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లోని ఏడు దుకాణాలకు వేలం పాట నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

అర్ధరాత్రి బుసక తరలింపు



పెడన: మండలంలోని కాకర్లమూడి గ్రామంలో అర్ధరాత్రులు బుసక అక్రమంగా తరలించేస్తున్నారు. గ్రామానికి చెందిన జనసేన నాయకుడు కన్నుసన్నల్లో ఈ అక్రమ దందా నడిపిస్తూ అధికారుల కళ్లు గప్పి తరలించేస్తున్నారని, అధికారులు పటిష్ట నిఘా పెట్టి బుసక తరలింపు జరగకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

బిందు సేద్యంపై శిక్షణ

మేళ్లమర్తిలంక(మోపిదేవి): మండలంలోని మేళ్లమర్తిలంక గ్రామంలో బిందు సేద్యం, ఆచ్ఛదనా పద్ధతులపై శుక్రవారం రైతులకు ఒక రోజు శిక్షణ కల్పించారు. ఈ సందర్భంగా ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ వి.మంజువాణి మాట్లాడుతూ బిందు సేద్యం వల్ల కలుపు సమస్య తగ్గుతుందని ఎరువులు, పురుగు మందులు డ్రిప్ ద్వారా ఇవ్వవచ్చునని తెలిపారు. ఆచ్ఛదనా పద్ధతుల్లో రకాలు వాటి ఉపయోగాలు వివరించి ఏ కాలంలో ఎటువంటి ఆచ్ఛాదన అవలంభించాలో రైతులకు వివరించారు. ఈ పద్ధతుల వల్ల పంట దిగుబడి దాదాపుగా 20 నుంచి 50 శాతం వరకు పెరుగుతుందని తెలిపారు. కేవీకే సమన్వయకర్త డాక్టర్ డి.సుధారాణి, డాక్టర్ బి.నవీన్, గ్రామ సర్పంచ్, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

అయ్యప్ప దీక్ష సమితి అధ్యక్షుడిగా కేటీఆర్



పెడన: అయ్యప్ప దీక్ష ప్రచార సమితి పెడన మండల అధ్యక్షుడిగా కొత్త తులసి నాగవెంకట మురళీకృష్ణ(కేటీఆర్) ఎన్నికయ్యారు. శుక్రవారం స్థానిక శ్రీవాసవి కన్యకా పరమేశ్వరీ క్షేత్రంలో అఖిల భారత అయ్యప్ప దీక్ష సేవా సమితి జిల్లా అధ్యక్షుడు ఆమంచి వాసుదేవ హనుమంతరావు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఊసా వెంకటేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్ ఎస్.పిచ్చిబాబు, సెక్రటరీ ఐ.కాంతారావు, జాయింట్ సెక్రెటరీ ఎంఎస్‌వీ ప్రసాద్, వేముల కృష్ణ తదితరుల సమక్షంలో కేటీఆర్‌తో పాటు కార్యవర్గ సభ్యులుగా 30 మందిని నియమించినట్లు సమితి నాయకులు తెలిపారు.

త్రీమెన్ కమిటీలు ప్రకటన

పెదకళ్లేపల్లి(మోపిదేవి): ఎట్టకేలకు మరో రెండు త్రీమెన్ కమిటీలను నియమిస్తూ శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మండలంలో మొత్తం 10 పీఏసీఎస్‌లు ఉండగా తొలి విడతలో ఏడు సొసైటీలకు త్రీమెన్ కమిటీలను ప్రభుత్వం ప్రకటించింది. అనివార్య కారణాలతో మూడు సొసైటీలను వాయిదా వేసింది. ఇప్పుడు పెదకళ్లేపల్లి పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా అరజా రాధిక, సభ్యులుగా పాముల శ్రీనివాసరావు, అనుమకొండ రాజు, మేళ్లమర్తిలంక పీఏసీఎస్ చైర్మన్‌గా నాగినేని ధనుంజయరావు, సభ్యులుగా తోట శరత్‌బాబు, మోర్ల వెంకటేశ్వరావులను నియమించినట్లు ఆయా సొసైటీ కార్యదర్శులు తెలిపారు. మిగిలిన కొక్కిలిగడ్డ సొసైటీకి ప్రకటించాల్సి ఉంది.

అడ్డగోలుగా ఆశీలు వసూళ్లు

- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు
- ఆవేదన వ్యక్తం చేస్తున్న చిరు వ్యాపారులు



వినాయక చవితి రోజున ఆశీలు వసూళ్లు చేస్తున్న టీడీపీ నాయకుడు(ఫైల్)

పెడన: పురపాలక సంఘ పరిధిలో ఆశీలు వసూళ్లు అడ్డగోలుగా చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పురపాలికలో వారి ఆగడాలకు అంతులేకుండా పోతోంది. నియోజకవర్గ ప్రజాప్రతినిధి పీఏ ఒత్తిడి వల్లనే అడ్డగోలుగా సాగుతున్న ఆశీలు వసూళ్లను అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు తీవ్ర స్థాయిలో వెల్లువెత్తుతున్నాయి. పట్టణంలో ఆశీలు వసూళ్ల కోసం 2025-26 ఏడాదికి సంబంధించి మార్చిలో బహిరంగ వేలం నిర్వహించారు. ఓ మహిళ పేరుతో రూ. 25.09లక్షలకు పాడుకున్నారు. ఈ మహిళకు బినామీగా పట్టణానికి చెందిన టీడీపీ నాయకుడు ఒకరు ఆశీలు వసూళ్లు చేస్తుండటం విశేషం. సదరు నాయకుడు గతంలో ఆశీలు వేలం పాట పాడి డిఫాల్టర్‌గా గుర్తింపు తెచ్చుకుని మున్సిపాలిటీ రికార్డులకు ఎక్కారు. ప్రస్తుతం ఆశీలు వేలం దక్కించుకున్న మహిళకు సదరు డిఫాల్టరు బినామీగా ఉంటూ పట్టణంలో ఆశీలు దందా చేస్తున్నారు. స్వీపింగ్ ఛార్జీలు, జీఎస్టీ కలిపి మొత్తం రూ. 32లక్షల వరకు మున్సిపాలిటీకి చెల్లించాల్సి ఉంది. అందుకు తగ్గ విధంగా బ్యాంకు చెక్కులు మున్సిపల్ అధికారులకు అందజేయాలి. ఈ చెక్కులు నేటి వరకు అందించలేదు. అంతేకాకుండా గెజిట్ నోటిఫికేషన్ ప్రకారం కాకుండా వారి ఇష్టానుసారంగా ఆశీలు వసూళ్లు చేస్తున్నారు. ఈ విధంగా వసూళ్లు చేయడంలో అధికారుల పాత్రపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.


నిబంధనలకు పాతర

పట్టణంలోకి బోలోరా, వ్యాను, మ్యాక్సి, టాటా ఐషన్ మినీ వ్యాను తదితర వాహనాలు ఎగుమతి లేదా దిగుమతి కోసం వస్తే వాటి నుంచి గెజిట్ నోటిఫికేషన్ ప్రకారం రూ.100లు వసూళ్లు చేసి బిల్లు ఇవ్వాలి. కాని రూ.150లు వసూళ్లు చేసి బిల్లులు కూడా జారీ చేస్తున్నారు.



పెడన పురపాలక సంఘం పరి...
టౌన్ ఎంట్రీ ఆశీలు
2025-2026 సంవత్సరము...
కాంట్రాక్టరు : వాజిదున్ని...
బొలేరా, వ్యాను, మ్యాక్సీ, టాటా ఐ...
(ఎగుమతి-దిగుమతి చేసినందుకు)
...నెం. | ఆశీలు ఫీజు : రూ.150/-

మినీ వ్యానులకు రూ.100లు బదులు రూ.150 వసూళు చేసిన బిల్లు



గెజిట్‌లో పేర్కొన్న ధరలు

టాటా ఏస్‌కు రూ.60లు కట్టించుకోవాల్సిన చోట రూ.80లు వసూళ్లు చేస్తున్నారు. అంతేకాకుండా పట్టణంలోని మున్సిపల్ సంఘానికి సంబంధించి రోడ్డు మార్జిన్‌లో వ్యాపారం చేసుకోవడానికి 2025-26 ఏడాదికి రూ.35లు ఇవ్వాలని ఒత్తిడి చేయడమే కాకుండా వారికి బిల్లులు కూడా జారీ చేస్తుండటం గమనార్హం. వీరిని ఇలాగే వదిలేస్తే మరింత దందా నిర్వహించి వసూళ్లు చేస్తారని అధికారులు తక్షణం నియంత్రించాలని చిరు వ్యాపారులు డిమాండ్ చేస్తున్నారు. వినాయక చవితి పర్వదినం నాడు అయితే పూలు, పత్రి, పండ్లు విక్రయించడానికి వచ్చిన వ్యాపారుల నుంచి రెండు రోజులకు గానూ రూ.300 వసూళ్లు చేశారని విమర్శలు వ్యక్తమయ్యాయి.

చర్యలు తీసుకుంటాం



ఆశీలు అడ్డగోలుగా వసూళ్లు చేస్తున్న వాటిపై ఫిర్యాదులు వస్తున్నాయి. అయితే లిఖితపూర్వకంగా ఎవరూ ముందుకు రావడం లేదు. మెప్మా నుంచి కూడా పలువురు చిరువ్యాపారులు ఆశీలుపై ఫిర్యాదులు చేశారు. గెజిట్‌లో పేర్కొన్న విధంగానే వసూళ్లు చేయాల్సి ఉంది. ఈ విషయమై రెవెన్యూ విభాగం అధికారులతో సమావేశం నిర్వహించి తగిన చర్యలు తీసుకుంటాం.

ఎల్.చంద్రశేఖరరెడ్డి, కమిషనర్, పురపాలక సంఘం, పెడన

యూరియా పంపిణీ పరిశీలన



మోపిదేవి పీఏసీఎస్ వద్ద యూరియా కట్టలు పరిశీలిస్తున్న తహసీల్దార్ హరనాథ్

మోపిదేవి: మండలంలోని ఎనిమిది వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో రైతులకు యూరియా కట్టల పంపిణీని స్థానిక తహసీల్దార్, మండల వ్యవసాయాధికారి హెప్సిబారాణి శుక్రవారం పరిశీలించారు. తహసీల్దార్, ఏవో బృందాలుగా ఏర్పడి సొసైటీలను సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు. మేళ్లమర్తిలంక పీఏసీఎస్‌కు 15 టన్నులు, పెదకళ్లేపల్లి-1కు 15.075 టన్నులు, వెంకటాపురంకు 10, మెరకనపల్లికు 10.125, అడపావారిపాలెంకు 5.075, మోపిదేవికు 20, కొక్కిలిగడ్డకు 15.075, కె. కొత్తపాలెంకు 15.075 టన్నులు చొప్పున యూరియా వచ్చినట్లు తహసీల్దార్ హరనాథ్ తెలిపారు. ఆయా పీఏసీఎస్ చైర్మన్లు, త్రిమెన్ కమిటీ సభ్యులు, సొసైటీ కార్యదర్శులు పాల్గొన్నారు.

యూరియా కోసం తప్పని తిప్పలు



నాగేశ్వరరావుపేటలో బారులు తీరిన రైతులు

బంటుమిల్లి: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం ప్రభుత్వం ఏర్పాటు చేసిన యూరియా కేంద్రాల నుంచి కట్టలు తెచ్చుకోవడానికి అనేక ఇబ్బందులు పడ్డారు. బంటుమిల్లి పీఏసీఎస్ పరిధిలో 17 గ్రామ పంచాయితీలు ఉన్నాయి. నాగేశ్వరరావుపేట ఆర్‌ఎస్‌కేలో నాగేశ్వరరావుపేట, ములపర్రు, చోరంపూడి, ఆముదాలపల్లి గ్రామాలకు, బంటుమిల్లి పీఏసీఎస్‌లో బంటుమిల్లి, పెందుర్రు, పెదతుమ్మిడి, మల్లపరాజుగూడెం, మల్లేశ్వరం గ్రామాలకు, అర్తమూరు పార్మర్ ప్రొడక్షన్ ఆర్గనైజేషన్(ఎఫ్‌పీఓ)లో అర్తమూరు, సాతులూరు, చినతుమ్మిడి గ్రామాలకు యూరియా పంపిణీకి కేంద్రాలు ఏర్పాటు చేశారు. అయితే ప్రతి గ్రామంలోను ఆర్‌ఎస్‌కేలు ఉండగా వాహన సౌకర్యం లేని గ్రామాల్లో యూరియా పంపిణీ ఏర్పాటు చేసి ఇచ్చిన యూరియా కట్టలు తీసుకువెళ్లడానికి ఇబ్బందులకు గురి చేశారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో లాగా ఆర్బీకేల ద్వారా ఎరువులు అందజేయాలని రైతులు కోరుతున్నారు.

బాధ్యతగా ప్రజలకు సేవలందించండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సంగా మధుసూదనరావు

గూడూరు: ప్రజా సమస్యల పరిష్కారం, మండల అభివృద్ధి పట్ల అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని గూడూరు ఎంపీపీ సంగా మధుసూదనరావు స్పష్టం చేశారు. గూడూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ మధుసూదనరావు అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లోని సమస్యలను స్థానిక ప్రజాప్రతినిధులు దృష్టికి తీసుకువచ్చినప్పుడు వాటి పరిష్కారం దిశగా అధికారులు చొరవ తీసుకోవాలన్నారు. గూడూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో గత ప్రభుత్వ హయాంలో మంజూరైన అదనపు తరగతి గదులు ఇప్పటికీ పూర్తి కాకపోవడంపై ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్ రంగబాబు అసంతృప్తి వ్యక్తం చేశారు. మండలంలో లోతట్టు ప్రాంతాల్లోని అంగన్‌వాడీలు, ప్రహరీ లేని అంగన్‌వాడీల వివరాలు ఇవ్వాలని డీసీ చైర్మన్ పోతన స్వామి ఆదేశించారు.

గైర్హాజరుపై ఆగ్రహం

సమావేశానికి వివిధ శాఖల అధికారులు గైర్హాజరు కావడం పట్ల ప్రజాప్రతినిధులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలో ప్రధానంగా ఉన్న చేనేత సమస్యలపై చర్చించడానికి చేనేత జౌళి శాఖ అధికారులు హాజరు కాలేదు. ఆయా శాఖల అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఎంపీపీ ఆదేశించారు. సమావేశంలో వైస్ ఎంపీపీలు నేతల కుటుంబరావు, పిచ్చుక గంగాధరరావు, ఎంపీడీవో కె.వి.రామకృష్ణ, తహసీల్దారు డి.రాజ్యలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ చాణిక్య

కోడూరు: సముద్రంలో వేటకు వెళ్లే మత్స్యకారులు అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోడూరు ఎస్ఐ చాణిక్య అన్నారు. శనివారం మండలంలోని హంసలదీవి గ్రామంలో కోడూరు పోలీసులు, పాలకాయతిప్ప మెరైన్ పోలీసులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వేట సమయంలో అనుమానాస్పద బోట్లు కనిపిస్తే వెంటనే స్థానిక మెరైన్ పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. వేటకు వెళ్లే మత్స్యకారులు తప్పనిసరిగా తమ ఐడీ కార్డులను దగ్గర ఉంచుకోవాలన్నారు. తీరప్రాంత ప్రజలు విపత్తులపై కూడా అవగాహన కలిగి ఉండాలని, అధికారుల సూచనలు పాటించాలని మెరైన్ ఎస్ఐ పూర్ణమాధురి తెలిపారు. రెవెన్యూ శాఖ చట్టాలను వీఆర్వో గోపాలకృష్ణ వివరించారు. అటవీశాఖ హెచ్‌సీ వి.సత్యన్నారాయణ, సాగర్‌మిత్ర మోషే, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభ

మచిలీపట్నంటౌన్: నగరంలోని జవ్వారు పేట శ్రీవెంకటేశ్వర హైస్కూల్లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు పలు అంశాలపై ప్రదర్శన ఇచ్చారు. కరెంట్ అఫైర్స్, దేశాలు – రాజధానులు, అబాకస్, స్పోకెన్ ఇంగ్లీష్, రూబిక్స్‌క్యూబ్ సాల్వింగ్, తల్లిదండ్రులు పిల్లలతో వ్యవహరించాల్సిన తీరు తదితర అంశాలపై విద్యార్థులు ప్రదర్శన ఇచ్చారు. కార్యక్రమంలో హిందూ విద్యాసంస్థల డైరెక్టర్ అన్నపూర్ణ, స్కూల్ ప్రిన్సిపాల్ ఎం.సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మచిలీపట్నంటౌన్: నగరంలోని గొడుగుపేట పాత విద్యుత్ ఉపకేంద్రం మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం ఎనిమిది నుంచి 10.30 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ జి.గోవిందరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని రాజుపేట, మినర్వా రోడ్డు, నాగపోతరావు సెంటర్, ఆజాద్ రోడ్డు, గొడుగుపేట, చెమ్మనగిరిపేట, బలరామునిపేట, కుమ్మరిగూడెం, మూడు స్తంభాల సెంటర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

పామర్రు సబ్‌స్టేషన్ పరిధిలో..

చల్లపల్లి: పామర్రు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో సాంకేతిక మరమ్మతుల కారణంగా శనివారం చల్లపల్లి, మోపిదేవి, ఘంటసాల మండలాల్లో వ్యవసాయ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఉయ్యూరు డివిజన్ డీఈ డి.కృష్ణనాయక్ తెలిపారు. ఉదయం ఎనిమిది నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

సీవీడ్ కల్చర్‌పై శిక్షణ



సొర్లగొంది(నాగాయలంక): మత్స్యశాఖ ఆధ్వర్యంలో మండలంలోని సొర్లగొంది గ్రామంలో శుక్రవారం సముద్రపు నాచు(సీవీడ్)పెంపకంపై మహిళలకు ఆచరణాత్మక శిక్షణ నిర్వహించారు. ఈ శిక్షణలో మత్స్యకార మహిళలు డ్వాక్రా సభ్యులకు ఫిషరీస్ శాస్త్రవేత్త ఎ.చంద్రశేఖర్ సముద్రపు నాచు ప్రయోజనాలు, కల్చర్ చేయు విధానాలపై అవగాహన కలిగించారు. నాచును ఔషధాలు, కేకులు, ఇతర ఆహార పదార్థాల్లో వినియోగిస్తారని తెలిపారు. అవనిగడ్డ మత్స్యశాఖ సహాయ సంచాలకురాలు ఆర్.ప్రతిభ మాట్లాడుతూ వ్యవసాయ రంగం, ఆహార పరిశ్రమ, జంతువుల ఆహారం, సౌందర్య సాధనాల తయారీ, ఔషధాల ఉత్పత్తి సంస్థల్లో ఉపయోగించే విధానాలను వివరించారు. మత్స్యశాఖ అభివృద్ధి అధికారి టి.సునీత, సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ కార్యదర్శి సస్పెన్షన్

మోపిదేవి: బాధ్యతల నిర్వహణలో అలసత్వం వహించిన మోపిదేవి గ్రామ పంచాయతీ కార్యదర్శి, పెదకళ్లేపల్లి పంచాయతీ ఇన్‌చార్జ్ ఎం.మల్లేశ్వరావును జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం సస్పెండ్ చేశారు. ఇంటి పన్నుల వసూలులో అలసత్వం, రాష్ట్ర, జిల్లా అధికారుల కాన్ఫరెన్స్‌కు గైర్హాజరు, విధి నిర్వహణలో నిర్లక్ష్యం వంటి కారణాలతో సస్పెండ్ చేసినట్లు ఎంపీడీవో స్వర్ణభారతి తెలిపారు.

వైభవంగా గంగానమ్మ జాతర



దేవతా వేషధారణలతో ప్రదర్శన ఇస్తున్న కళాకారులు

బంటుమిల్లి: మండలంలోని రామవరపుమోడి గ్రామంలో గ్రామ దేవత గంగానమ్మ జాతర శుక్రవారం మూడవ రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా స్థానిక రామాలయం వద్ద ఏర్పాటు చేసిన పోతురాజు మండపాల నుంచి మేళతాళాలు, కనకతప్పెట్లు, దేవత వేషధారణలతో గ్రామోత్సవం నిర్వహించారు. స్థానికులు అమ్మవారికి ఘనస్వాగతం పలికి నీళ్ల బిందెలతో వారుపోసి పూజలు చేశారు. స్థానిక అంకాలమ్మ గుడి వద్ద రాజమండ్రికి చెందిన కళాకారులు దేవతల వేషధారణలతో చేసిన నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.

రాధాకృష్ణ కుటుంబ సభ్యులకు పరామర్శ



రాధాకృష్ణ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు



నాగేశ్వరరావుకు నివాళులర్పిస్తున్న ఉప్పాల రాము

చల్లపల్లి: ఇటీవల మృతిచెందిన స్థానిక గణేష్ ప్రింటింగ్ ప్రెస్ అధినేత వక్కలగడ్డ రాధాకృష్ణ కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు శుక్రవారం పరామర్శించారు. రాధాకృష్ణ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులు పరామర్శించి సానుభూతి తెలిపారు. సింహాద్రి వెంట పార్టీ దివ్యాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కొల్లూరి శామ్యూల్, మండల కన్వీనర్ శీరం వెంకట సత్యనారాయణ, మండల ఉపాధ్యక్షుడు కొమ్ము డేవిడ్, అబ్దుల్ అర్షద్, భాగ్యారావు తదితరులు ఉన్నారు.

కార్యకర్తకు నివాళి

కృత్తివెన్ను: మండలంలోని నీలిపూడి గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకుడు బుద్దన శివ తండ్రి నాగేశ్వరరావు (97) శుక్రవారం మృతిచెందారు. ఆయన భౌతికకాయానికి వైఎస్సార్ సీపీ పెడన నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఉప్పాల రాము నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. రాముతో పాటు కృత్తివెన్ను ఎంపీపీ కూనసాని గరుడప్రసాద్, నాయకులు గరికపాటి రామానాయుడు, పాశం సుబ్రహ్మణ్యం, రాము, కూనసాని సుగుణకుమార్, ఆలపాటి బాబ్జీలు ఉన్నారు.

సచివాలయ ఉద్యోగులపై ఒత్తిడి తగ్గించాలి



మోపిదేవిలో ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామ సచివాలయ ఉద్యోగులు

మోపిదేవి: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు ప్రతిసారి ఇంటింటికీ తిరిగి విధులు నిర్వహించడం వల్ల క్షేత్రస్థాయిలో తీవ్ర అవమానాలు, ఆత్మ గౌరవానికి భంగం వాటిల్లుతోందని ఆ బాధ్యతల నుంచి తప్పించాలని కోరుతూ మండలంలోని గ్రామ సచివాలయ ఉద్యోగులు ఎంపీడీవో జె.స్వర్ణభారతికి వినతిపత్రం అందజేశారు. శుక్రవారం సాయంత్రం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవోను కలసి తమ సమస్యలు వివరించారు. సమయపాలనలేని ఒత్తిడితో కూడిన విధుల నుంచి విముక్తి కల్పించాలని, కార్యాలయ పనివేళలు పాటించకుండా వీడియో కాన్ఫరెన్సులు నిర్వహించడం, సెలవులు, పండుగలు ఆదివారాల్లో కూడా బలవంతపు విధులు చేయించడం ఆపివేయాలని కోరారు. 15 రోజుల్లోగా పరిష్కారం చూపని పక్షంలో సచివాలయ ఉద్యోగుల ఐక్యవేదిక తరపున రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడతామని స్పష్టంచేశారు.

పెడన: పట్టణంలోని వార్డు సచివాలయ ఉద్యోగులు శుక్రవారం మున్సిపల్ కమిషనర్ ఎల్.చంద్రశేఖరరెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. తమ డిమాండ్లను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి సానుకూలంగా స్పందించాలని కమిషనర్‌ను వారు కోరారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించండి



అవనిగడ్డలో తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

అవనిగడ్డ: ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం నియోజకవర్గంలోని అన్ని మండల తహసీల్దార్లకు వినతి పత్రాలు సమర్పించారు. సీపీఎస్‌ని రద్దు చేయాలని, పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను తక్షణం విడుదల చేయాలని, 12వ పీఆర్సీ కమిషన్‌ను నియమించాలని, ఐఆర్ ప్రకటించాలని, మెమో 57 అమలు చేయాలని, అన్ని రకాల బకాయిలను చెల్లించాలని, ఈహెచ్ఎస్ పరిమితిని రూ. 25లక్షలకు పెంచాలని, యాప్‌లు అసెస్మెంట్ బుక్‌లెట్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ అవనిగడ్డలో తహసీల్దార్ నాగమల్లేశ్వరరావుకు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.సాంబశివరావు, కార్యదర్శి చీర్ల నాగప్రసాద్, ఆడిట్ కమిటీ కన్వీనర్ వైవీ కృష్ణకాంత్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మచిలీపట్నంఅర్బన్: ఉపాధ్యాయులకు పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు అంబటిపూడి సుబ్రహ్మణ్యం డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. అనంతరం డెప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం అందించారు. మచిలీపట్నం మండల అధ్యక్షుడు రాంగోపాల్, ఉపాధ్యాయులు సురేష్, కోటయ్య, రవి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు సైకిళ్లు వితరణ



బాలికలకు సైకిళ్లు అందించిన మేనేజర్ పవన్‌కుమార్, హెచ్‌ఎం తదితరులు

నాగాయలంక: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నాగాయలంక బ్రాంచి ఆధ్వర్యంలో స్థానిక జెడ్పీ హైస్కూల్ ప్లస్‌లో శుక్రవారం ఐదుగురు బాలికలకు రూ. 25వేలు విలువైన సైకిళ్లు పంపిణీ చేశారు. బ్యాంకు సామాజిక బాధ్యత(సీఎస్ఆర్ ఫండ్స్)కింద బ్రాంచి మేనేజర్ తుంగల పవన్‌కుమార్ చేతుల మీదుగా వీటిని పేద మెరిట్ బాలికలకు అందజేశారు. ఈ సందర్భంగా పొదుపు ఖాతాలు తెరవడం వల్ల కలిగే ప్రయోజనాలు, ఆర్థిక ప్రణాళిక ప్రాముఖ్యతలపై బ్యాంకు అధికారులు విద్యార్థులకు అవగాహన కలిగించారు. పాఠశాల హెచ్‌ఎం అలపర్తి సత్యనారాయణ, బ్యాంకు ఇన్‌చార్జి క్యాషియర్ వి.శివప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చేనేతలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి



ఘంటసాలలో చేనేత కార్మికుల సమస్యలపై చర్చిస్తున్న అధ్యయన కమిటీ సభ్యులు

ఘంటసాల: చేనేతలకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని చేనేత కార్మిక సమస్యల అధ్యయన కమిటీ డిమాండ్ చేసింది. ఏపీ చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర చేనేత కార్మిక సంఘం నాయకుడు అందె జగదీష్ ఇంటి వద్ద చేనేత సమస్యలపై శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో చేనేత కార్మికులు, చేనేత సహకార సంఘాలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో ఏపీ చేనేత సంఘం రాష్ట్ర కార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వరరావు, ఏపీ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కేవీ ప్రసాద్, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బి.మాధవస్వామి, రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కట్టా హేమసుందరరావు, రాష్ట్ర సహాయ కార్యదర్శులు గొట్టుముక్కల బాలాజీ, వై.పీతాంబరరావు, కృష్ణాజిల్లా అధ్యక్షుడు కోదాటి నారాయణరావు, కోదాటి నాగయ్య, కృష్ణాజిల్లా మాజీ చేనేత అధ్యక్షుడు పేరిశెటి విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

గూడూరు: చేనేత కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ కప్పలదొడ్డి సర్పంచి యక్కల మాధవి, ఎంపీటీసీ సభ్యురాలు పేరిశెట్టి తేజోవతి శుక్రవారం ఎంపీపీ సంగా మధుసూదనరావుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి చేనేత కుటుంబానికి ఆగస్టు నుంచి ఇస్తామన్న 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందడం లేదన్నారు. రూ.5కోట్ల త్రిఫ్ట్ ఫండ్ బకాయి ఇప్పటికీ జమ కాలేదన్నారు. మగ్గానికి ఇస్తానన్న రూ. 25వేల ఆర్థిక సాయం, చేనేత సంఘాలకు 5శాతం జీఎస్టీ అమలు కావడం లేదన్నారు. 50 ఏళ్ల పైబడిన చేనేత కార్మికులకు గత 18 నెలలుగా కొత్త పెన్షన్ మంజూరు కాలేదన్నారు. అంతేకాకుండా సంఘాలకు ఉన్న బకాయిలు, మార్కెటింగ్ ఇన్సెంటివ్‌లు అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు.